సాక్షి నల్లగొండ

శనివారం । 12 । అక్టోబర్ । 2024



గీత వృత్తిని కాపాడేందుకు..

కల్లు గీత వృత్తిని కాపాడేందుకు కాటమయ్య రక్షణ కిట్లు అందజేస్తున్నట్లు శాసన మండలి చైర్మన్ పేర్కొన్నారు. - 6లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 50,066 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 50,066 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,826 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,274 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 9,166 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 644.40 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 1,151 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,460 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 243.90 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 170.73 క్యూసెక్కులు

• జయ.. జయహే మహిషాసురమర్దిని



నల్లగొండలోని రాక్ హిల్స్‌కాలనీలో మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు

చెడుపై మంచి గెలిచిన రోజు

నేటి దసరా ఉత్సవాలకు అంతా సిద్ధం

- శమీ పూజకు ఏర్పాట్లు
- సందడిగా మారిన పల్లె, పట్నం

రామగిరి(నల్లగొండ) : చెడుపై విజయమే విజయ దశమి.. విజయానికి ప్రతీకగా దేశమంతా జరుపుకునే విశేషమైన పండుగ దసరా. సకల దేవతల శక్తి స్వరూపిణిగా అమ్మవారు అవతరించి మహిషాసురుడిని వధించిన రోజున వేడుకలు నిర్వహిస్తారు. విజయదశమి రోజునే అర్జునుడు కౌరవ సేవలను అంతమొందించినట్టుగా కథనం. దుష్టసంహారం జరిగిన రోజున.. విజయాలకు ప్రతీకగా ఈ పండుగ జరుపుకుంటారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు నిర్వహించి పదో రోజు దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. విజయదశమి సందర్భంగా అమ్మవారి ఆలయాలన్నీ పండగ శోభ సంతరించున్నాయి. విజయదశమి రోజున అమ్మవారిని రాజరాజేశ్వరి అలంకారంలో పూజిస్తారు.

నేడు ఆయుధ పూజ..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయుధపూజ నిర్వహించుకోనున్నారు. రైతులు వ్యవసాయ పనిముట్లు, వాహనదారులు తమ వాహనాలకు, పోలీసులు ఆయుధాలకు ఇలా ఎవరికివారు తమ వృత్తుల్లో ఉపయోగించే పనిముట్లు, ఆయుధాలకు పూజలు చేస్తారు.



పానగల్ రోడ్డులోని శంకర్ గోశాలలో జమ్మి చెట్టుకు అమ్మవారి అలంకరణ

శమీ పూజ..

విజయదశమి రోజు శమీ దర్శనం కోసం జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. అగ్నిని శమింపజేయడానికి ఉపయోగించిన వృక్షమే శమీ వృక్షం. అటువంటి శమీ వృక్షం వద్దకు విజయదశమి నాటి సాయంత్రం చేరుకుని ప్రదక్షిణలు చేసి ఆకుని తీసుకు వచ్చి పెద్ద వారికి ఇచ్చి వారికి పాదాభినందనం చేసి ఆశీర్వాదం తీసుకుంటారు.

పాల పిట్ట దర్శనం ప్రత్యేకం

దసరా పండుగ రోజు సాయంత్రం పాల పిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉన్నది. ఈ రోజున మూడు రకాల పక్షులను చూడడం ఆనవాయితీ. పాల పిట్టను చూస్తే పాపాలు, కర్రె పిట్టను చూస్తే కష్టాలు, గరత్మంతుడు అంటే గద్దను చూస్తే గండాలు తొలుగుతాయని ప్రజల నమ్మకం. ఇందుకోసం శమీపూజ అనంతరం కిలో మీటర్ల దూరం అటవీ ప్రాంతంలోకి పోయి పాలపిట్టను దర్శించుకుంటారు.

మంత్రి కోమటిరెడ్డి దసరా శుభాకాంక్షలు



నల్లగొండ : దసరా పండగ సందర్భంగా ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి తెలంగాణ ప్రజలకు అద్భుతమైన విజయాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరి జీవితంలో సుఖసంతోషాలు నిండాలని.. పాడిపంటలతో తెలంగాణ విలసిల్లాలని దుర్గామాతను ప్రార్థించారు.





ప్రజలతో రద్దీగా మారిన నల్లగొండలోని ఎస్పీటీ మార్కెట్

రద్దీగా మారిన మార్కెట్లు..

రామగిరి(నల్లగొండ) : దసరా పండుగ సందర్భంగా కొనుగోలుదారులతో ప్రధాన పట్టణాల్లో మార్కెట్లు రద్దీగా మారాయి. నల్లగొండ పట్టణంలోని ఎస్పీటీ, ఎల్‌పీటీ మార్కెట్లు కస్టమర్లతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకాలు, బంగారం, వస్త్ర దుకాణాల్లో సందడి నెలకొంది. అదే విధంగా పూలు, పండ్ల మార్కెట్లు శుక్రవారం రద్దీగా కనిపించాయి. విజయదశమి సెంటిమెంట్ కావడంతో చాలా మంది కొత్త వాహనాలు కొనుగోలు చేస్తారు. దీంతో శనివారం నూతన వాహనాల విక్రయాలు భారీగా జరగనున్నాయి.

గురుకులాల్లో నాణ్యమైన విద్య



ఇంటిగ్రేటెడ్ గురుకుకుల పాఠశాల శంకుస్థాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

నల్లగొండ : కుల మతాలకతీతంగా పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలకు ఒకేచోట అధునాతన సౌకర్యాలతో గురుకుల పాఠశాల నిర్మిస్తున్నామన్నారు. ఎనిమిది నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. సంవత్సరం కాలంలో రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలన్నీ బంద్ కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 70 వేలమందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 65 రోజుల్లో డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కేసీఆర్ కేజీ టు పీజీ అని పదేపదే చెప్పి.. తప్పించుకుంటే తమ ప్రభుత్వం చేసి చూపిస్తోందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం ద్వారా రెండు పంటలకు నీరందే విధంగా పనులు వేగవంతం చేస్తామన్నారు. ఏఎమ్మార్పీ కాల్వల్లో సొంత డబ్బులతో కంప చెట్లను తొలగించామన్నారు. నల్లగొండ మెడికల్ కళాశాలకు రూ.45 కోట్లు మంజూరు చేయడం వల్ల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా నవంబర్‌లో మెడికల్ కాలేజీ ప్రారంభిస్తామన్నారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలు పేద విద్యార్థులకు గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిగా కృష్ణవేణి

నల్లగొండ : జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వయో వృద్ధుల, దివ్యాంగుల శాఖ అధికారిగా కృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆమె యాదాద్రి జిల్లాలో పనిచేసి నల్లగొండకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా పనిచేసిన చింతపల్లి సీడీపీఓ సక్కుబాయి నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు.

14న బుద్ధవనంలో ధమ్మ విజయం వేడుకలు



నాగార్జునసాగర్ : బుద్ధవనంలో ఈ నెల 14వ తేదీన ధమ్మ విజయం వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, బుద్ధవనం ప్రత్యేకాధికారి ఎన్.ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ మహేంద్రాహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్, మైసూర్ బైలకుప్పెలోని సెరా బుద్ధ విహారం నుంచి వచ్చే బౌద్ధాచార్యుల సమక్షంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

పీఆర్‌టీయూలో అసంతృప్తులు

- అసోసియేట్ అధ్యక్షుడు తరాల పరమేష్ రాజీనామా



పరమేష్

నల్లగొండ : పీఆర్‌టీయూలో అసంతృప్తి బయటపడింది. ఇటీవల నల్లగొండ జిల్లా కమిటీతోపాటు రాష్ట్ర కమిటీ ఏర్పాటు సందర్భంలో ఆ సంఘం రెండు గ్రూపులుగా విడిపోంది. నల్లగొండ జిల్లా కమిటీ ఎన్నిక సందర్భంలో సామాజిక న్యాయం లోపించిందని ఆ సంఘానికి చెందిన జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తరాల పరమేష్ శుక్రవారం రాజీనామా చేశారు. వారం క్రితం జరిగిన జిల్లా ఎన్నికలో బీసీ అభ్యర్థిగా ఆయన జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పదవికి పోటీకి సిద్ధమయ్యారు. రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు–1 పదవి తీసుకున్నారు. కానీ ఇటీవల జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ప్రకటించిన జిల్లా కార్యవర్గ జాబితాలో ఆయన బాధ్యతను తగ్గిస్తూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు–2గా ప్రకటించారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం తీరు సరిగా లేదని.. సంఘంలో సామాజిక న్యాయం కొరవడిందని.. ఆత్మగౌరవాన్ని చంపుకుని సంఘంలో మనుగడ సాగించలేనని పేర్కొంటూ తరాల పరమేష్ అసోసియేట్ అధ్యక్ష పదవికి, సంఘ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.

14న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ



సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లపల్లి రవి

నల్లగొండ : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ ఈ నెల 14న నల్లగొండలో ఏర్పాటు చేసినట్లు ఆ సమితి రాష్ట్ర కో కన్వీనర్ తాళ్లపల్లి రవి తెలిపారు. శుక్రవారం నల్లగొండలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి చెన్నయ్య తెలిపారు. ఈ సభకు మాలలు, మాల ఉద్యోగులు, యువకులు, అంబేడ్కర్‌వాదులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు, నాయకులు ఎన్నమల్ల అనిల్, నాగటి జోసఫ్, చింతపల్లి బాలకృష్ణ, నామ చక్రవర్తి, అన్నిమల్ల డిండిప్రసాద్, అన్నిమల్ల లింగస్వామి, రొయ్య కిరణ్‌కుమార్, ముడుసు భిక్షం, రెడ్డిమల్ల బాబు పాల్గొన్నారు.





అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు.. పంచామృతాలు, వేద మంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం జరిపించారు. సాయంత్రం ప్రధాన ఆలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్రాలు, మహిళా భక్తుల నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాదస్వరాన్ని వినిపించారు.

గీత వృత్తిని కాపాడేందుకు రక్షణ కిట్లు



గీత కార్మికులకు రక్షణ కిట్లు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నకిరేకల్: కల్లు గీత వృత్తిని కాపాడేందుకు వారికి కాటమయ్య రక్షణ కిట్లు అందజేస్తున్నట్లు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బీసీ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో భాగంగా 208 మంది గీత కార్మికులకు శుక్రవారం నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో రక్షణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాటి చెట్టు పైనుంచి పడి ప్రమాదాల బారిన వారికి నెల లోపే ఎక్స్‌గ్రేషియా అందేలా సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మిగిలిన కార్మికులకు రెండవ విడతలో రక్షణ కిట్లు అందజేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ఆలోచన చేసి గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి రక్షించాలని కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి గీత కార్మికుడికి రక్షణ కిట్టు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యాదాద్రి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమేష్, ఎక్సైజ్ సీఐ మల్లయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజిత, వైస్ చైర్ పర్సన్ ఉమారాణి, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య, కల్లుగీత సంఘం అధ్యక్షుడు జానయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నియోజకవర్గ అభివృద్ధి కోసం తన పదవిని సైతం త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనానికి శుక్రవారం ఆయన శంస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి సంబంధించి మొదటి లిస్టులో మునుగోడు నియోజకవర్గం లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంకట్‌రెడ్డిలను ఒప్పించి పాఠశాలను మంజూరు చేయించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క అభివృద్ధి పనికి నిధులు మంజూరు చేయించి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలను మూసివేయిస్తున్నామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు, చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, డీపీఓ మురళి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ముదిరాజ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, మాజీ జెడ్పీటీసీలు చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, పాశం సురేందర్ రెడ్డి, వీరమళ్ల భానుమతివెంకటేష్, మాజీ ఎంపీపీలు కర్నాటి స్వామి, తాడూరి వెంకట్ రెడ్డి, నాయకులు పోలగొని సత్యం గౌడ్, జాజుల అంజయ్య గౌడ్, భీమనపల్లి సైదులు, జాల వెంకన్న యాదవ్, వేమిరెడ్డి జితెందర్ రెడ్డి, మందుల బీరప్ప పాల్గొన్నారు.

రీజినల్ అలైన్‌మెంట్ మార్చాలి

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భూ నిర్వాసితులు శుక్రవారం కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. మొదట రూపొందించిన ప్రకారంగా కాకుండా పలుమార్లు అలైన్‌మెంట్‌ను మార్చారని, ఫలితంగా నిర్వాసితుల సంఖ్య, నష్టం విలువ భారీగా పెరిగిందని వాపోయారు. గత అలైన్‌మెంట్ ప్రకారం చౌటుప్పల్‌లో జంక్షన్‌కు 78ఎకరాల భూసేకరణకు నిర్ణయించారని, ప్రస్తుతం రూపొందించిన డంబెల్ ఆకారం జంక్షన్‌కు ఏకంగా 182 ఎకరాలు సేకరించేందుకు హద్దులు వేశారని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే గజ్వేల్, రాయగిరి, చౌటుప్పల్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

మా వద్ద BA లో తెలుగు, హిందీ Lit కొరకు ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పి.జి, MBA, B.Tech, LLB, ITI డిప్లమా, ఫార్మసీ, B.Ed, B.PEd. అ.కై. సంప్ర॥ 9948131154. కోదాడ. [Y-1124891]

Real Estate

PLOT FOR SALE

గజం 2500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటి వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, కాటేజి, 30 పండ్ల మొక్కలు 30 ఎర్రచందనం మొక్కలతో 5 &10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా॥ గోల్డ్ కలదు. సంప్ర: 6304222202 [G-3174]

SRM డ్రీమ్ సిటి DTCP వెంచర్ చర్లపల్లి నల్లగొండ మున్సిపాలిటి నందు 33x45=165 గజాల పడమర ఫేస్ ప్లాటు అమ్మబడును. ధర గజానికి 8000/- సంప్ర॥ 9666666762 [Y-1124883]

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 14000 చ॥గ॥ HMDA & RERA Approved లేఅవుట్ ఓపెన్ ప్లాట్స్. బ్యాంక్ లోన్ సదుపాయం. 6309527694 [SCA24000367]

HOUSE FOR SALE

Independent House 150 Sq.yds, G+1, 4 Bed Rooms At Nandihills Colony, Near Bommalagudi, Hayathnagar. Rs. 94 Lacks. Ph: 9866424722, 9392090953. [HA-14848]

Wanted

రెడీమెడ్ బట్టల షాపులోకి వర్కర్స్ కావలెను. పర్మినెంట్ & టెంపరరీ, కీర్తి క్రియేషన్స్, ప్రకాశం బజార్, నల్లగొండ. సంప్ర॥ 9247272429 [Y-1124896]

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్ ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [H-796283]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.